


21న వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

ఖమ్మం మార్కెట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 21న సోమవారం బోనాల పండుగ సందర్భంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ఈనెల 19, 20 శని, ఆదివారాలు సైతం వారాంతపు సెలవులు ఉన్నాయని, దీంతో వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 22న మంగళవారం యథావిధిగా క్రయ, విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లోనూ..
మీకు గుణపాఠమే

- మీతో పెద్దగా చర్చించే పని లేదు..
- ప్రజలే మీ గురించి చర్చించుకుని తీర్పులు ఇస్తున్నారు
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినా.. మీ తీరు మారలేదు
- అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఆపేస్తే మేం పూర్తి చేశాం
- సీతారామను, గోదావరి బ్రిడ్జిని పూర్తి చేసి ప్రారంభించాం
- కేటీఆర్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫైర్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూలై 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు చర్చించి మళ్లీ మీకు గుణపాఠం చెప్పడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోస్యం చెప్పారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా.. మీరు, మీ తీరు మారలేదని.. కనీసం ఆత్మ విమర్శ కూడా చేసుకోలేదని బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. అభివృద్ధిని అధ్వానం చేసి, అసంపూర్తిగా వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో సీతారామతో పాటు గోదావరి బ్రిడ్జి వంటి పనులు పూర్తిచేసి ప్రారంభించిన విషయం మీకు కనిపించడం లేదా!? అని నిలదీశారు. మీ హయాంలో రేళ్లపాడు సీతారామ డిజైన్‌ను మార్చి ఇల్లెందు, మహబూబాబాద్ ప్రజలకు అన్యాయం చేసి ఇప్పుడు రోడ్డెక్కి మాట్లాడడం మీకు తగదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మీరు చేసిన విమర్శలు, మీరు మాట్లాడిన భాష ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి తుమ్మల విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఖమ్మం పర్యటనలో ముఖ్యమంత్రిపై చేసిన విమర్శలను మంత్రి తుమ్మల తిప్పికొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేటీఆర్ చేసిన విమర్శలను మంత్రి తుమ్మల ఖండించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి వంటి వ్యక్తులపై విమర్శలు చేసేటప్పుడు అవి ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలన్నారు. పత్రికల్లో రాయలేని పదాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం మీ అహంకారానికి, మీ దౌర్భాగ్యపు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇలాంటి విమర్శలతో మీరు మరింత పలచనకాక తప్పదన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్థాయిలో ఉండి అలాంటి మాటలు మాట్లాడితే తెలుగు రాష్ట్రాల ప్రజలు మీ భాషను సహించబోరన్నారు. ప్రజలు అసహ్యించుకుంటున్నారని, మీచేష్టల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ ఏర్పడుతుందన్నారు. మీ భాష తెలుగు ప్రజలు తలదించుకునేలా ఉందన్నారు. ఇప్పటికైనా నీచమైన దుర్భాషలు మాట్లాడవద్దని, ఎవరిని ఎవరు పీకరని, మీరు కూడా పీకేదిలేదన్నారు. గత ఎన్నికల్లో ప్రజలే మిమ్మల్ని పీకేసిన విషయం మరిచిపోయారా!? అని కేటీఆర్‌ను (... మిగతా 6వ పేజీలో)



ఇందిరమ్మ రాజ్యంలో..
మహిళలకు ప్రత్యేక గుర్తింపు

- ప్రతీ మహిళ ఎస్‌హెచ్‌జీలో చేరాలి
- మహిళా సంఘాల రుణాల్లో 99శాతం తిరిగి చెల్లింపులు
- ప్రతీ సంక్షేమ పథకంలో వారికే ప్రాధాన్యం
- లబ్ధిదారులకు వడ్డీలేని రుణాలు, రేషన్‌కార్డులు
- పంపిణీ చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- మహిళల చుట్టూనే సాగిన బహిరంగ సభ

6

ఎన్నికలు ఎప్పుడొచ్చినా..
విజయం మాదే..


ఖమ్మంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

- రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు వంద సీట్లు గ్యారంటీ
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి
- అన్నిచోట్లా బీఆర్‌ఎస్ గెలవాలి
- నాయకులు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పిలుపు

ఖమ్మం, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్రంలో ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగినా.. విజయం తమదేనని.. బీఆర్‌ఎస్ వంద సీట్లు గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనపై అన్నివర్గాల ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్ధానాలతో బీఆర్‌ఎస్ ఓటమి చెందిందని, ఈ 18 నెలల పాలనలో ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచేలా కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని పిలుపునిచ్చారు. పోటీ చేసేవారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన కేటీఆర్ ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పినపాక మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తల్లి మరణించడంతో రేగా కాంతారావును కూడా పరామర్శించారు. ఖమ్మంలో మమత ఆస్పత్రి ఆవరణలో హెలీప్యాడ్ దిగిన అనంతరం మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికి ఆదర్శంగా నిలిపిందన్నారు. 2014లో 63 సీట్లు, 2018లో 88 సీట్లు గెలిచామని.. కానీ 2023లో కొత్తకు వింత.. పాతకు రోత అన్నట్టుగా కాంగ్రెస్ మోసపూరిత వాగ్ధానాలతో ప్రజలు మోసపోయారన్నారు. సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీలు ఇచ్చిన హామీలు, అన్నివర్గాలకు డిక్లరేషన్లు అన్నిచెప్పిన మాటలు చూసి మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏ ఒక్కటి అమలు చేయలేకపోయారన్నారు. రూ.2లక్షల రుణ మాఫీ అందరికీ కాలేదని, రైతుభరోసా రూ.15వేలు ఇస్తామని ఇవ్వలేదని, పింఛన్లు రూ.4వేలు చేస్తామని చేయలేదని, మహిళలకు రూ.2500, 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు స్కూటీలు ఇలా ఏ ఒక్కటీ ఇవ్వలేదని విమర్శించారు. కొన్ని దేశాల్లో రీకాల్ పద్ధతి ఉందని, మన రాజ్యాంగంలో అంబేద్కర్ రీకాల్ పద్ధతి రాసి ఉంటే ఈరోజు తెలంగాణలో (.. మిగతా 6వ పేజీలో)

నేడు, రేపు మధిరలో సీపీఐ
జిల్లా మహాసభలు



- ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు
- తరలిరానున్న రాష్ట్ర నేతలు

మధిర రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా సీపీఐ పార్టీ 23వ మహాసభలు ఈ నెల 19, 20 తేదీల్లో మధిరలో జరుగనున్నాయి. ఇందుకు మధిరలోని రెడ్డి గార్డెన్స్ ప్రాంగణం వేదికగా నిలవనుంది. పోరాటాల పురిటిగడ్డగా చైతన్యానికి ప్రతీక అయిన మధిరలో సీపీఐ పార్టీ 23వ మహాసభలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేసింది. శని, ఆదివారాల్లో రెండురోజులపాటు ఈ సభలు జరుగనున్నాయి. 600మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. 28తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు హాజరుకానున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు నెల్లికంటి సత్యంలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. మహాసభల ఏర్పాట్లను ఆహ్వాన సంఘం పూర్తిచేసింది. మహాసభల సందర్భంగా మధిర పట్టణాన్ని పార్టీ జెండాలు, తోరణాలతో సుందరంగా అలంకరించారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. మహాసభల ప్రాంగణాన్ని పోటు ప్రసాద్ నగర్‌గా నామకరణం చేశారు. ఆహ్వానసంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రిన్సిపల్ కర్నాటి రామ్మోహన్‌రావు, కార్యదర్శి బెజవాడ రవిబాబు, ఎంఏ.రహీం, వూట్ల కొండల్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. సమకాలీన పరిస్థితులు, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలకు సంబంధించి మహాసభల్లో 28 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు మహాసభ నిర్వాహక వర్గం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, పార్టీ స్థితిగతులు, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమం తదితర విషయాలకు సంబంధించి మహాసభల్లో తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలులో జాప్యం, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలపై తీర్మానాల ఆమోదం అనంతరం మహాసభల్లో కార్యాచరణను రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు. రానున్న మూడేళ్ల కాలానికి పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ విస్తరణ, స్థానిక ఎన్నికలు, ప్రజా ఆందోళనలు తదితర అంశాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ఎజెండాకు సభల్లో రూపకల్పన చేయనున్నారు.

సీఎం పదవికి మేం ముగ్గురం
ఆశపడటం లేదు

- రాబోయే మూడున్నర ఏళ్లు మా సీఎం రేవంత్‌రెడ్డే..
- మా ముగ్గురి ఫోన్లు ట్యాప్ చేశారనే కేటీఆర్ ఆరోపణ నిరాధారం
- అధికారంలో ఉన్నప్పుడు అవే బుద్ధులు.. ప్రతిపక్షంలోనూ అవేనా..
- కేటీఆర్ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గరం గరం


భద్రాచలం రామాలయ పరిసరాల్లో కూల్చివేతలను పరిశీలిస్తున్న మంత్రి

భద్రాచలం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి ప్రమాదముందని, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తన ఫోన్లను సీఎం రేవంత్ ట్యాప్ చేయిస్తున్నారని మాజీ మంత్రి కె.తారకరామారావు చేసిన ఆరోపణలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘాటుగా స్పందించారు. మా ముగ్గురి ఫోన్లు ట్యాప్ చేశారని కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేశారని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇది వారి సంస్కృతి, వారి ఆలోచన అని, వారు అధికారంలో ఉన్నప్పుడు ఏవైతే చేశారో అవే ఇతర ప్రభుత్వాలు వ్యక్తులు చేస్తున్నారనుకోవడం అవివేకమన్నారు. సీఎం పదవి కోసం మేం ముగ్గురుం ఆశపడటం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మిగిలిన మూడున్నర ఏళ్లు సీఎంగా రేవంత్‌రెడ్డే కొనసాగుతారని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయాన్ని పలుమార్లు స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అవే బుద్ధులు.. ప్రతిపక్షంలోనూ అవే బుద్ధులా అంటూ ఘాటుగా విమర్శించారు. ఈ బుద్ధులు మార్చుకోకపోతే అసెంబ్లీలో అరకొర సీట్లు రాగా, గత పార్లమెంటులో బిగ్ జీరో వచ్చిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డబుల్ బిగ్ జీరో వస్తుందన్నారు. ఫోన్లు ట్యాప్ చేసేంత నీచాతి నీచమైన కార్యక్రమం ఈ ప్రభుత్వం చేపట్టబోదని స్పష్టం చేశారు. మీ పార్టీలో ఉన్న సంక్షోభాలు, అలజడులు, కోవర్టులు అని ఏవైతే మీ సోదరి చెప్పారో దాని గురించి పరిశీలించుకోవాలని హితవు పలికారు.

మరోసారి ఆర్కిటెక్ట్‌తో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించండి

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా రామాలయ పరిసరాల్లో ఇళ్ల తొలగింపు ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కావాలని స్థానిక అధికారులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. భద్రాచలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రామాలయ అభివృద్ధి కోసం దక్షిణం వైపు తొలగిస్తున్న ఇళ్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఇళ్ల తొలగింపు ముగిసిన అనంతరం స్థలాన్ని చదును చేసి మార్కింగ్ జెండాలు ఏర్పాటు చేసి దేవస్థానంకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తితో కలిసి కలెక్టరు జితేష్ వి పాటిల్, దేవస్థానం ఈవో రమాదేవిలు క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలన్నారు. మహిళ సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 865 కోట్లు మహిళ సంఘాల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రాబోయే మూడున్నర ఏళ్లలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

చిన్నకోరుకొండి శివాలయంలో
ఈ హుండీ

- ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ ద్వారా..
- హుండీ చోరీలకు చెక్

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా.. హుండీ చోరీలకు చెక్ పెట్టేందుకు ఓ ఆలయంలో ఈ హుండీ ఏర్పాటు చేశారు. కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో వేంచేసియున్న శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లిఖార్జున స్వామివారి (శివాలయం)ఆలయంలో శుక్రవారం ఓవర్‌సీస్ బ్యాంక్ మధిర బ్రాంచిశాఖ తరుపున ఈ-హుండీ ప్రారంభించారు. ఏ దేవాలయంలో లేని విధంగా భక్తులు నగదు కానుకలను ఫోన్‌పే, గూగుల్‌పే, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించే విధంగా ఏర్పాటు చేశారు. ఆలయాల్లో ఇనుప హుండీలకు నేటి రోజుల్లో భద్రత లేని కారణంగా ఆధునికంగా భక్తుల సౌకర్యార్థం వినూత్నంగా వరంగల్ రీజనల్ మేనేజర్ రుషిరంజన్, మార్కెటింగ్ మేనేజర్ ప్రతిమ సహకారంతో ఈ హుండీని ఏర్పాటు చేసినట్లు ఐఓబీ బ్యాంకు మేనేజర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఐఓబీ బ్యాంకు అధికారులకు స్థానిక భక్తులు అభినందనలు తెలిపారు.


మేనేజర్ చాంబర్‌లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

పాల్వంచ డివిజన్ కార్యాలయంలో..
ఏసీబీ అధికారుల సోదాలు

- పలు రికార్డులు, డాక్యుమెంట్లు, రూ.50 వేల నగదు స్వాధీనం
- కార్పొరేషన్ అధికారులతో పాటు సిబ్బందినీ విచారించిన అధికారులు

పాల్వంచ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పాల్వంచ డివిజన్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిపై పలు ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో.. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో సుమారు 13మంది ఏసీబీ అధికారులు కార్యాలయంలోని అన్ని విభాగాల్లో సుమారు ఆరు గంటల పాటు సోదాలు చేశారు. ప్రతీ విభాగంలోని కార్పొరేషన్ అధికారులను, సిబ్బందిని విచారించారు. వారి వివరణలను రికార్డు చేసుకున్నారు. కార్యాలయంలోని ప్రతీ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సిబ్బందిని సైతం తనిఖీ చేయగా.. అక్రమ పద్ధతిలో వారి వద్ద ఉన్న రూ.50 వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలు రికార్డులను, కంప్యూటర్లలోని డేటాను నిశితంగా పరిశీలించారు. కార్యాలయానికి (.. మిగతా 6వ పేజీలో)

మహిళా సాధికారతకే పెద్దపీట

- వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- నియోజకవర్గానికి అదనంగా 1500 ఇళ్లు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో మంత్రి పొంగులేటి

6



విజృంభిస్తున్న
జ్వరాలు

- ముంచుకొస్తున్న సీజనల్ వ్యాధులు
- ఆస్పత్రుల్లో భారీగా రోగులు
- వ్యక్తిగత పరిశుభ్రత తప్పని సరి
- డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ

6



భూ వివరాలు తెలుసుకుంటున్న వరంగల్ జోనల్ డీసీ సంధ్యారాణి

అసిస్టెంట్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- గణేష్ టెంపుల్ రికార్డుల పరిశీలన
- ఎండోమెంట్ భూములపై ఆరా..

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన వరంగల్ ఉప కమిషనర్ కేఎల్. సంధ్యారాణి కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణేష్‌టెంపుల్ అభివృద్ధి పనులు, రికార్డులు, తదితర అంశాలపై ఈవో రజనీకుమారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎండోమెంట్‌కు చెందిన భూములను ఆరా తీశారు. కోర్టు వివాదంలో గల చిట్టివారిసత్రం, కామేశ్వరమ్మ సత్రంలతోపాటు నిర్మాణంలో గల ఆర్యవైశ్య సత్రాన్ని సందర్శించి పరిశీలించారు. దేవాదాయశాఖ భూములను పరిరక్షించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. ఆమె వెంట ఉమ్మడి ఖమ్మం జిల్లా సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి, గణేష్‌టెంపుల్ ఈవో రజనీకుమారి తదితరులు ఉన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- ముంచుకొస్తున్న సీజనల్ వ్యాధులు
- వ్యక్తిగత పరిశుభ్రత తప్పని సరి
- డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ



కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ఓపీ వద్ద బారులు తీసిన రోగులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ జిల్లా అయినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వానలకు పారిశుధ్యం అస్తవ్యస్తం కావడంతో నివాస సముదాయాల ప్రాంతాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. దీంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులకు కారణమవుతున్నాయి. ఈ క్రమంలో రోగులు, ప్రజలు వైద్య సేవలను పొందేందుకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక, కొత్తగూడెంలోని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో, తదితర ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు ఓపీ వద్ద తమ పేర్లు నమోదు చేసుకొనేందుకు బారులు తీరారు.

ముంచుకొస్తున్న సీజనల్ వ్యాధులు...

జిల్లాలో సీజనల్ వ్యాధులు ముంచుకొస్తున్నాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న సబ్ డివిజన్ సెంటర్-2, పీహెచ్‌సీలు -29, సీహెచ్‌సీలు- 6, సబ్ సెంటర్లు-245 పరిధిలో ఉన్న ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి రక్త పరీక్షలు నిర్వహించారు. గత మూడేళ్లుగా జిల్లాలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు అధిక సంఖ్యలో నమోదయ్యాయి. 2023 ఏడాదిలో మలేరియా -190, డెంగ్యూ- 295, టైఫాయిడ్-411 కేసులు, 2024లో మలేరియా -85, డెంగ్యూ-185, టైఫాయిడ్ -780 కేసులు, 2025 ఇప్పటివరకు మలేరియా -42, డెంగ్యూ -17, టైఫాయిడ్ -113 కేసులు నమోదయ్యాయని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నిర్ధారించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ముందస్తుగా భద్రాద్రి వైద్య ఆరోగ్యశాఖ మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం దోమతెరలను పంపిణీ చేయాలంటున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉంది. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం ఉన్నట్లు అయితే వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొంది మిగతా కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రభావం పడకుండా చూసుకోవాలి. రోజు పౌష్టికాహారాన్ని తీసుకొని రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. దోమలు కుట్టకుండా రక్షణ జాగ్రత్తలు చేపట్టాలి.



గాజులతో అలంకరించిన దుర్గమ్మ అమ్మవారు



అమ్మవారికి సారెను తీసుకెళుతున్న మహిళలు

గాజులతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

అశ్వారావుపేట సాయిబాబా ఆలయం నుంచి సారె సమర్పణ

అశ్వారావుపేట రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రాలచెరువులో స్వయంభు శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆషాడమాస శుక్రవారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలను జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దాదాపు 300 డజనుల గాజులతో శాకాంబరి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్‌లో గల షిర్డీసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో అమ్మవారికి చీరసారె సమర్పించారు. 108 రకాల నైవేద్యాలు, ప్రత్యేక బోనాలతో ఆలయం నుంచి భక్తులు మేళతాళాల నడుమ ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. ఆలయంలో అమ్మవారికి చీరెసారెను భక్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మాగాపు వరలక్ష్మీ భవాని, పోలిశెట్టి శ్రీనివాసరావు, నారాయణరావు, వ్యాఘ్నేశ్వరావు, షిర్డీసాయిబాబా ఆలయ సేవాసమితి బాధ్యులు హరిబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు. ఇక నారాయణపురం కట్టమైసమ్మ తల్లి, గుమ్మడివల్లిలోని గంగానమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు బోనాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో..
మహిళలకు ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అన్ని సంక్షేమ పథకాల్లో వారికే గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలని, మహిళా ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తే 90శాతం తిరిగి చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో నూటికి నూరుశాతం చెల్లిస్తున్నారని, అదే పురుషులకు అప్పులిస్తే ఇంతే సంగతులు అనే రీతిగా మారిందని మంత్రి తుమ్మల తనదైన శైలిలో మహిళలను ఉత్సాహ పరిస్తూ ప్రసంగించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రేషన్‌కార్డులు, అటవీశాఖ వనమహోత్సవం వంటి కార్యక్రమంలో శుక్రవారం ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్కులో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మహిళలకు స్ఫూర్తి కలిగేలా మాట్లాడారు. ఏ జిల్లాలో లేని విధంగా ఖమ్మం జిల్లాలో మహిళా అధికారులే ఎక్కువగా ఉన్నారని.. ఏసీఎల్‌పీ, జడ్పీ సీఈవో, డీఎంహెచ్‌వో.. ఇలా కీలకమైన బాధ్యతలో ఉన్నారని పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో 2లక్షల మంది మహిళలు ఉంటే వారిలో కేవలం 40వేల మంది మహిళలు మాత్రమే సంఘాల్లో ఉన్నారని, మహిళలు ఎస్‌హెచ్‌జీలో సభ్యులుగా ఉంటే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. బ్యాంకు లింకేజీతో ఆర్థికంగా వ్యాపారాలు అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంతమంది మహిళలను కోటీశ్వర్లుగా చేయడానికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ఇల్లిచ్చినా, రేషన్‌కార్డు ఇచ్చినా, లోన్ ఇచ్చినా మహిళ మహాలక్ష్మీకి పథకాలు ఇవ్వడం ద్వారా ఆ కుటుంబాలను వారు చక్కగా చూసుకుంటారన్నారు. మహిళలు ఆర్థికంగా సంతోషంగా ఉంటే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం సంతోషంగా ఉంటుందనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. మహిళా మహాలక్ష్మీల దీవెనలతోనే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాడిందన్నారు. ప్రశాంతమైన, పచ్చని, పరిశుభ్రమైన, అభివృద్ధి కోరుతూ ప్రజలు తనకు అవకాశం కల్పించారని ఆ విషయాన్ని తాను ఎన్నడూ మరిచిపోనన్నారు. ఓడిపోయినోళ్లు, మళ్లీ రావాలనుకునేటోళ్లు, బయటోళ్లు ఏదైనా మాట్లాడుతారుని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ప్రజల సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురొడ్డి ఒక్కో సంక్షేమ పథకాన్ని పూర్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వాటి కోసం రూ.23వేల కోట్లు అవసరం పడిందన్నారు. అదే విదంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రాష్ట్రంలో 6.5లక్షల రేషన్‌కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ, మహిళా కార్పొరేటర్లు మంత్రి తుమ్మలతో ప్రత్యేకంగా గ్రూప్ ఫోటోలు తీయించుకున్నారు. పనిలో పనిగా వారి డివిజన్లలో సమస్యలను మంత్రికి వివరించారు.

అనంతరం కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. జిల్లాలో అమలు జరుగుతున్న పథకాలను వివరించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రతి మహిళను స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా చేర్పించాలని, ఇందుకోసం మెప్మా సీవోలు, ఆర్పీలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ వెలుగుమట్ల అర్బన్ పార్కులో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ప్లాస్టిక్ ఫ్రీ పార్కుగా తీసుకుంటున్న చర్యలు తెలిపారు. విద్యార్థుల నుంచి అన్ని వర్గాల ప్రజలు ఆహ్లాదంగా ఉండేందుకు సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. వంటశాలను అందుబాటులో ఉంచామన్నారు. జెడ్పీ సీఈవో దీక్షారైనా మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మహిళలు చాలా చైతన్యవంతంగా ఉన్నారని, బాలికల నుంచి మహిళల వరకు ఆదర్శంగా ఉంటున్నారని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా, కార్పొరేటర్లు రావూరి కరుణ, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, వీవీపాలేం సొసైటీ డైరెక్టర్ రావూరి సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో బోనాల జాతర

వైభవంగా శ్రీమహంకాళి అమ్మవారి రథోత్సవం



శ్రీమహంకాళి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై 18: శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలు శుక్రవారం కొత్తగూడెంలో బూడిదగడ్డలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శ్రీమహంకాళి అమ్మవారి రథయాత్ర కాళిఉపాసకులు నరేంద్రభవాని ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ మహంకాళి అమ్మవారి రథయాత్ర మహోత్సవం ఆలయం నుంచి కొనసాగింది. కొత్తగూడెంలోని ప్రధానవీధుల గుండా ఊరేగింపుగా సాగింది. భక్తులు అమ్మవారి రథాన్ని లాగుతూ తన్మయత్వం చెందారు. దారి పొడవున అమ్మవారి రథానికి ఎదురుగా నీటితో శుద్ధిచేస్తూ కొబ్బరికాయలు కొట్టి హారతులు సమర్పించుకున్నారు. ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలు, శివసత్తుల కేరింతలు, గిరిజనుల కొమ్మునృత్యాలు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి బోనం ఎత్తుకుని యాత్రలో పాల్గొన్నారు. ఆదివారం హోమ కార్యక్రమాలు బోనాల సమర్పణ, మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా, కాళి ఉపాసకులు నరేంద్రభవాని, ఇడుపుగంటి శ్రీనివాసరావు, లక్ష్మణ్, మాజీ వార్డు కౌన్సిలర్లు విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లోనూ.. మీకు గుణపాఠమే

(5వ పేజీ తరువాయి)

తుమ్మల ప్రశ్నించారు. మళ్లీ చర్చించేందుకు సిద్ధమని చెబుతున్నారు.. నాలుగుకోట్ల మంది ప్రజలు చర్చించే పదేళ్ల మీ పాలన చూసి మీ వాగ్దానాలు, హామీలు వైఫల్యాలు, అవినీతిపైనా చర్చించే ప్రజలు మీకు గుణపాఠం చెప్పారన్నారు. మిగులు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత మీదన్నారు. యా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన విధానంపై చర్చిస్తారా..!? నిపుణులు చెప్పిన దానిని కాదని కట్టరాని చోట కాళేశ్వరం కట్టి రూ.లక్ష కోట్లు దుర్వినియోగం చేసినందుకు చర్చిస్తారా.. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిపైనా చర్చిస్తారా..! అంటూ నిలదీశారు. చర్చించుకోవాల్సింది మనం కాదు ప్రజలే చర్చించుకుంటారని, వారికి వారే నిర్ణయం తీసుకుంటారన్నారు. అలాంటి నిర్ణయం తీసుకుని మిమ్మలను ఓడించి ఏడాదిన్నర కూడా కాలేదని, మళ్లీ చర్చించే సమయం వచ్చినప్పుడు ప్రజలు చర్చిస్తారన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు చర్చిస్తే ఏం జరిగిందో రేపు స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఏం చేస్తారో ఓపిక పట్టాలని, మీరు మాట్లాడే భాషను విమర్శలు తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. మీరు మాట్లాడిన మాటలు మీ పదవికి అవమానమన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులుంటే ఏం జరిగిందని చెప్పడం కాదు.. తెలుసుకుంటే మంచిదన్నారు. గత ప్రభుత్వంలోకూడా నేనన్న నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో జాతీయ రహదారుల అభివృద్ధికి చేపట్టిన చర్యల ఫలితంగానే తెలంగాణ రూపురేఖలు మార్చడం జరిగిందన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో త్రిబుల్ ఆర్ వంటి అనుమతులతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లోని సమస్యలను కేంద్రంతో దెబ్బలాడి ఏడాదిన్నరలోనే పరిష్కరించిందన్నారు. గోదావరి నదిపై సీతారామ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి ప్రాజెక్టులు మీరు కేంద్రం, సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు తీసుకోలేదన్నారు. కృష్ణానది జలాలపై కూడా కేంద్రంపై పోరాటం చేసి కేంద్రం కళ్లు తెరిపించి మా కృష్ణాజలాల్లో మా వాటా మాకు కావాలని , గోదావరి , కృష్ణాలో మనజలాలు మనకే దక్కేలా ప్రభుత్వం కృషిచేస్తుందని, ఇందుకు ముఖ్యమంత్రిని పిలిచి చర్చించడం జరిగిందన్నారు. ఈ నదీ జలాల పరిష్కారం కేంద్రం, సీడబ్ల్యూసీ చేయాలని, గతేడాదిన్నర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బలాడి చర్చల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. కృష్ణాజలాలతోపాటు గోదావరి జలాల్లో మన వాటా నిర్ధారించాలని కేంద్రంపై గట్టిగా వత్తిడి తేవడం జరిగిందన్నారు. మీరు పదేళ్లలో చేయని పని ఏడాదిన్నరలో ఈప్రభుత్వం చేపట్టిందన్నారు. గోదావరిపై కడుతున్న ప్రాజెక్టులకు అనుమతులు తేవడం జరిగిందన్నారు. రూ.8వేల కోట్లు ఖర్చుపెట్టి సీతమ్మసాగర్‌ను నిరుపయోగంగా వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో రాజీవ్‌లింక్‌కెనాల్ నిర్మించి గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు వదిలి తల్లాడ, పెనుబల్లి, కల్లూరు తదితర మండలాల రైతుల పొలాలను కాపాడమన్నారు. గతంలో తాను మంజూరు చేయించిన జాతీయ రహదారుల పనులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని, ఇవి మీ కళ్లకు కనిపించడం లేదా !? అని నిలదీశారు. ఏదైనా ఉంటే మీ నాన్నను అడగండి.. ఏది మాట్లాడాలో తెలుసుకోండి అని అన్నారు. ఖమ్మంలో మీరు చేపట్టిన అభివృద్ధి పనులన్నీ అస్తవ్యస్తం చేశారన్నారు.

మీ కుటుంబంలో మీకే సఖ్యత లేదు.

మీ కుటుంబంలో మీకే సఖ్యత లేదు.. ఇంట్లోనే సరిచేసుకోలేరు.. ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని ఏదో చేస్తామంటే మిమ్మలను తెలంగాణ ప్రజలు నమ్మరు.. ఇంకా మీరు అధికారంలోకి రావాలనుకోవడం, భవిష్యత్తులో కూడా జరగబోదు అని తుమ్మల స్పష్టం చేశారు. ఇప్పటికైనా మీ అహంకారాన్ని తగ్గించుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చింది మీరు, రోళ్లపాడు వద్ద శంకుస్థాపన చేస్తే ఆడిజైన్ మార్చి మళ్లీ రాజకీయం చేస్తున్నారని అని ప్రశ్నించారు. ఇల్లెందు, మహబూబాబాద్ ప్రాంతానికి అన్యాయం చేసింది మీరు కాదా!. అని ప్రశ్నించారు. అవసరమైతే మరో ఎత్తిపోతల పెట్టి ఇల్లెందు ప్రాంతానికి గోదావరి జలాలను అందిస్తామన్నారు. గోదావరిపై రెండోవారధికి శంకుస్థాపన చేస్తే దానిని అసంపూర్తిగా వదిలేశారని, మళ్లీ తాను, కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. రామాలయానికి మీరు హామీ తుంగలో తొక్కి నిధులు ఇవ్వకపోతే రేవంత్‌రెడ్డిని తీసుకువచ్చి రూ.33కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మీరు చేసిన విధ్వంసాన్ని ఏడాది కాలంలోనే సరిచేసుకుని అభివృద్ధి, సంక్షేమాన్ని గాడిలో పెట్టామన్నారు. ఇంకా సిగ్గులేకుండా ఏ కారణాలతో ఓడిపోయారో.. ఆ కారణాలనే మళ్లీ పునరావృతం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో సకల జనులు ఉద్యమించడంతో రాష్ట్రం వచ్చిందని, అలాంటి రాష్ట్రాన్ని మీ స్వార్థం కోసం అవినీతి బాగోతాలతో రాష్ట్రాన్ని పదేళ్లు భ్రష్టు పట్టించారన్నారు. మళ్లీ అదే అధికారం కోసం తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. మీ దుర్మార్గపు పలుకులు మానుకోవాలన్నారు. మీరు గోదావరి, బనకచర్లపై బొంకినా, కూలిన కాళేశ్వరంపైనా బొంకినా.. అది తెలంగాణ ప్రజలకు మీ చరిత్ర తెరిచిన పుస్తకం లాంటిదన్నారు.మీ నాన్న పనికిరాని మాటలు మాట్లాడాలని చెబుతున్నా.. ఆయన ఆవేదన పడుతున్నా.. కుటుంబంలో వినే పరిస్థితి కనపడడం లేదని అన్నారు. ఆయన మీద మీకు గౌరవంలేదని, తెలంగాణ ప్రజల మీద గౌరవం లేదన్నారు. అందరినీ అగౌరవ పరచడం మీకు మంచిదికాదని, మీభాష ద్వారా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కూడా దెబ్బతీస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేకపోయినా ఎరువుల కొరత ఉందని, కృత్రిమ ఆందోళనలు చేపట్టి ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఎరువుల కోసం ముఖ్యమంత్రి కేంద్రం పెద్దలను అనేకసార్లు కలిశారని, చైనానుంచి ఎరువులు దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీమేయర్ ఫాతిమాజోహార, కార్పొరేటర్లు కమర్తపు మురళి, కరుణ, సొసైటీ అధ్యక్షుడు యలగొండస్వామి, చోటాబాబా పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా..
విజయం మాదే : కేటీఆర్

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉండేది కాదన్నారు. ఓటేసిన పాపానికి ఈ పాలనపై వ్యతిరేకత ఉన్నా.. మరో మూడేళ్లు భరించాల్సిన పరిస్థితి ప్రజలకు నెలకొందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ సమీకరణాల్లో భాగంగా గత ఎన్నికల్లో తీవ్ర నష్టం జరిగిందని, ఇది ఒకరకంగా మంచిదేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలన చూస్తున్నారని, కాంగ్రెస్ కొత్తదనం ఏంటో 18 నెలల్లోపే చూసి విరక్తి చెందుతున్నారన్నారు. ఎన్నికలంటూ వస్తే ఈ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డికి, బీజేపీకి తెలుసు కేసీఆర్ వందసీట్లు గెలిచి అధికారంలోకి వస్తారని.. ఈ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. వందరోజుల్లో ఆరుగ్యారంటీలు అని చెప్పి గ్యారంటీలను బొందపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. గుర్రం విలువ తెలియాలంటే అప్పుడప్పుడు గాడిదను కూడా చూడాలన్నారు. కాంగ్రెస్ అనే గాడిద రాష్ట్రంలో సృష్టిస్తున్న అరాచకాన్ని చూసి ప్రజలు భయపడుతున్నారన్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా చేసిందేమీ లేదన్నారు. ఒకాయన బాంబులు పడతాయని చెబుతూ ఏ బాంబులు వేయకుండా బాంబులేటిరెడ్డిగా మారిపోయారని, మరో ఆయన కమీషన్లతో కాలం గడుపుతున్నారని, ఇంకో మంత్రి ఎరువులు సకాలంలో ఇవ్వలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో 2 లక్షల టన్నుల ఎరువుల కొరత ఉందన్నారు. మళ్లీ పాత కాలంలాగా రైతులు చెప్పులు, ఆధార్‌కార్డులు లైన్‌లో పెట్టే పరిస్థితి నెలకొందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచి తీరాలని, రెండు జిల్లా పరిషత్‌లు కైవసం చేసుకోవాలని కోరారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ భరతం పట్టాలని, రేవంత్‌రెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కోసం పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని, ఇందుకు ఇప్పటినుంచే ఎన్నికల కోసం నడుం బిగించాలన్నారు. ప్రజాబలం ముందు తలవంచక తప్పదని, ఖమ్మం జిల్లా నుంచే సందేశం ఇవ్వాలని, ఇందుకోసం పార్టీని గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల విసుగు చెందారన్నారు. బీఆర్ఎస్ పట్ల ప్రజాదరణ పెరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను సమష్టిగా గెలిపిద్దామన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బానోతు చంద్రావతి, జడ్పీమాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకే పెద్దపీట

ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాచలం/బూర్గంపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారత కోసం ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో శుక్రవారం ఐటీడీఏ ఆవరణలోని గిరిజన భవన్‌లో జరిగిన ఇందిర మహిళ శక్తి సంబరాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. వడ్డీ లేని రుణాలు, మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన భీమా భద్రత పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు, రేషను కార్డులు, సబ్సిడీ బియ్యం వంటి పథకాలు నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనమన్నారు.

మహిళలను ఆర్థికంగా అభివృద్ధిపర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పాలనలో రూ.3,750 కోట్ల పావలా వడ్డీ రుణ బకాయిలు చెల్లించలేదని ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.865 కోట్లు మహిళ సంఘాల ఖాతాల్లో జమ చేశామని మంత్రి పొంగులేటి ఎతలిపారు. అంతే కాకుండా మహిళ సభ్యుల భీమా పథకాన్ని పునరుద్ధరించామన్నారు. గత పాలనలో 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు మహిళలకే స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉండేదని ప్రస్తుతం 15 నుంచి 65 ఏళ్ల వయస్సు గల మహిళలకు సభ్యత్వం కల్పించడం ద్వారా లక్షలాది మంది లబ్ది పొందుతున్నారన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణం ప్రధాన లక్ష్యంగా తీసుకుందని భద్రాచలం నియోజకవర్గంకు అదనంగా 1500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరీకి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రాబోయే మూడున్నర సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పేదలకే రేషను కార్డులే ఇవ్వలేకపోయిందని, నేడు ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం రేషనుకార్డుతో పాటు పోషక విలువలతో కూడిన సన్న బియ్యంను అందజేస్తుందని అన్నారు.

మహిళ సంఘాల ద్వారా భద్రాచలం ఖ్యాతి విశ్వ వ్యాప్తి



భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రచలం నియోజకవర్గ పరిధిలో 390 మహిళ సమాఖ్య సంఘాల ద్వారా సుమారు 40 వేల మంది మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మహిళలు తయరు చేసే రాగి మాల్టు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని అన్నారు. ఇందిరమ్మ మహిళ శక్తి సంఘల ద్వారా ఆహార పదార్దల తయారీ ద్వారా భద్రాచలం ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్నారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గుర్తించారు. జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్‌లు మాట్లాడుతూ భద్రాచలం మహిళలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ ప్రాంత మహిళలు తయారు చేసే ఆహార పదార్థాలు ఇతర ప్రాంతాల వారికి ఆదర్శప్రాయంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 268 స్వయం సహాయక సంఘాలకు

రూ.17.64 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీలేని రుణాలు 2673 సంఘాలకు రూ.3.23 కోట్లు పంపిణీ చేశారు. అలాగే లోన్‌భీమా, ప్రమాద భీమా కింద 17 మంది సభ్యులకు రూ.22.49,230 నామినీలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీఎస్‌వో రుక్మిణి, భద్రాచలం తహసీల్దారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాల్వంచ డివిజన్ కార్యాలయంలో..
ఏసీబీ అధికారుల సోదాలు

(5వ పేజీ తరువాయి)

వచ్చిన దరఖాస్తులను, వాటి స్థితిగతులను సిబ్బందిని అడిగి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. చివరిగా కార్పోరేషన్ కమిషనర్ సుజాత, మేనేజర్ ఎల్వీ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌లను వేర్వేరుగా విచారించారు. రికార్డుల నిర్వహణ, దరఖాస్తుల ప్రక్రియ, ఇతర అనుమతుల జారీలో అక్రమాలను గుర్తించి.. ఆధారాలను సేకరించారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. వాటికి తోడు అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయని, ఈ క్రమంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్టు తెలిపారు. కార్యాలయంలో అక్రమాలను గుర్తించామని, తదుపరి చర్యల నిమిత్తం వాటన్నింటినీ ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

భారీ మొత్తంలో ఆన్‌లైన్ లావాదేవీలు !?

ఏసీబీ దాడుల్లో అధికారులు భారీ మొత్తంలో ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. కార్పోరేషన్ కమిషనర్ కార్యాలయంలో అటెండర్, కమిషనర్ డ్రైవర్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు.. ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించగా విస్తుపోయేలా రూ. లక్షల్లో ట్రాన్సాక్షన్స్ జరిగినట్లుగా తెలుస్తోంది. ఆ నగదును వారికిఎవరు ట్రాన్స్‌ఫర్ చేశారు!? ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశారు!? ఎవరికోసం ట్రాన్స్‌ఫర్ చేశారు !? అవి చివరకు ఎవరి ఖాతాల్లోకి చేరాయి !? అన్న విషయాలపై కూపీ లాగుతున్నట్లుగా సమాచారం. ఈ క్రమంలోనే వారిద్దరిని పూర్తిస్థాయిలో విచారించారని, వారి సెల్‌ఫోన్లనుంచి డేటాను రికవరీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.


ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ బాబురావు

నానో యూరియా, నానో డీఏపీ వాడాలి

- డీఏఓ బాబూరావు
- జూలూరుపాడు సొసైటీ కార్యాలయం తనిఖీ

జూలూరుపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీలను వాడి పంటల దిగుబడిని పెంచుకోవాలని భద్రాద్రి జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు సూచించారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. నిల్వలకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల కలిగే ఉపయోగాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేదన్నారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి దీపక్ ఆనంద్,ఏఈఓ గౌస్, సీఈఓ రమణారెడ్డి,సిబ్బంది జి.నిరంజన్ సాయి, నున్నాసునీత,ఎస్.అమల పాల్గొన్నారు.

ఎరువుల కొరతను నివారించాలి

తిరుమలాయపాలెం, జూలై18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులకు కావాల్సిన యూరియా దొరకడంలేదని, యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మాస్‌లైన్ జిల్లానాయకుడు కమ్మకోమటి నాగేశ్వరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పట్టువదలని విక్రమార్క!

- వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణలో భట్టి ముద్ర
- పనులతో నీటి ప్రవాహానికి తొలగిన అడ్డంకులు
- రెండు దశల్లో రూ.వంద కోట్లకు పైగా నిధుల వ్యయం
- ఆధునికీకరణకు ఆద్యుడు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


ఆధునికీకరణ తర్వాత కుడి కాల్వలో వేగంగా ప్రవహిస్తున్న నీరు

వైరా, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునికీకరణ పనులతో నీటిప్రవాహానికి చాలావరకు అడ్డంకులు తొలగిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో రెండు దశల్లో భట్టి విక్రమార్క కృషి, చొరవతో రూ.వందకోట్లకుపైగా నిధులతో పనులు చేశారు. ఉమ్మడి ఏపీలో 2006 ప్రాంతంలోభట్టి విక్రమార్కకు ఎలాంటి అధికారిక పదవి లేని సమయంలోనే అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అయిన కోనేరు రంగారావు తోడ్పాటుతో కుడి, ఎడమకాల్వల ఆధునికీకరణ పనులకు నిధుల మంజూరు కోసం కృషిచేశారు. ఆ సమయంలో వైరా మండలం మధిర నియోజకవర్గం పరిధిలో ఉండేది. అప్పటికే మధిర నియోజకవర్గంలో పోటీచేసేందుకు నాలుగు దఫాలుగా ప్రయత్నించిన భట్టి విక్రమార్క ముందుగా నియోజకవర్గంలోని వైరా ప్రాంతంపై దృష్టిసారించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నడుం బిగించారు. 2007లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ ఆధునీకరణ పనులపై మరింతగా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అప్పటి సీపీఎం ఎమ్మెల్యే కట్టా వెంకటనర్సయ్య కూడా భట్టి విక్రమార్క ప్రయత్నాలకు సహకారం అందించారు. నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.50.43కోట్ల జపాన్ బ్యాంకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి వరకు కుడి, ఎడమకాల్వల కింద ఉన్న 17300 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదిత ఆయకట్టు ఆధునికీకరణ తర్వాత 22630ఎకరాలకు నిర్ధారించి ఈ పనులు చేపట్టారు.

● 2009లో శంకుస్థాపన

మొదటి దశలో చేపట్టిన ఈ ఆధునికీకరణ పనులకు 2009 జనవరి 4న అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మధిర పర్యటన సందర్భంగా శంకుస్థాపన చేశారు. అదే సంవత్సరం నియోజకవర్గాల పునర్విభజనతో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భట్టి విక్రమార్క మధిర ఎమ్మెల్యేగా గెలిచారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి వైరా ఆధునికీకరణ పనులకు తనవంతు తోడ్పాటు నిచ్చారు. ఆధునికీకరణ పనుల్లో భాగంగా కుడి కాల్వ 7.5కిలోమీటర్లు, ఎడమకాల్వ 9.3కిలోమీటర్లు సిమెంట్ గైడ్‌వాల్స్‌ను నిర్మించారు. అలాగే వైరా రిజర్వాయర్ వద్ద ఐదో అలుగు నిర్మాణం, ఆక్వీడెక్టుల పునర్నిర్మాణం, ఆరు కిలోమీటర్ల కంకరరోడ్లు, అప్పటినీటి సంఘాల పరిధిలో రైతుల సౌకర్యం కోసం గోదాములు ఇతర ఆధునీకరణ పనులు చేశారు. అయితే వ్యయంతో రూ.50.43కోట్ల నుంచి దాదాపు రూ.65కోట్లకు చేరుకుంది. దాంతో నిధుల కొరతతో పూర్తిస్థాయిలో కాల్వల ఆధునికీకరణ పనులు చేయలేకపోయారు.

ప్రస్తుతం రెండోదశలో రూ.42.10కోట్లతో..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు తొమ్మిదిన్నరేళ్లకుపైగా కొనసాగిన సమయంలో రిజర్వాయర్ ఆధునికీకరణ పనులకు ఒక్కపైసా నిధులు కూడా మంజూరు కాలేదు. ప్రత్యేక రాష్ట్రంలో 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, వైరా మండలానికే చెందిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టడం జరిగింది.ఈసమయంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అభ్యర్థనతో రూ.42.10కోట్ల నిధులు మంజూరు చేసిన భట్టి విక్రమార్క గత ఏడాది ఆగస్టు 9న ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఈ పనుల ప్రారంభంలో జాప్యం జరగడంతో రెండో విడతలో కుడికాల్వలో 6.2కిలోమీటర్ల సిమెంట్ గైడ్‌వాల్స్‌ను కేవలం రెండున్నర నెలల కాలంలో నిర్మించారు. మిగిలిన సిమెంట్ లైనింగ్‌ను ఈ ఏడాది చేయలేకపోయారు. ఎడమకాల్వ పరిధిలో లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో సిమెంట్ గైడ్‌వాల్స్ మాత్రమే నిర్మించారు. సిమెంట్ లైనింగ్ మిగిలిపోయింది. ఎడమ కాల్వ గరికపాడు బ్రాంచ్ కెనాల్‌లో సిమెంట్ గైడ్‌వాల్స్, సిమెంట్ లైనింగ్ పనులు జాప్యం కారణంగా చేపట్టలేదు. మొదటి, రెండు దశల్లో చేసిన ఆధునికీకరణ పనులతో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి వృథా తగ్గిపోయింది. మిగిలిన పనులను ఈ ఖరీఫ్ సీజన్ అనంతరం పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.


పనులపై అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క(ఫైల్)

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీసర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్ రంగాలలో మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి బి.పురందర్ తెలిపారు. రెగ్యులర్ పద్ధతిలో డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ(ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైన్‌లు, పార్సికులు) అభ్యర్థులు దరఖాస్తులను ఆగస్టు18 వరకు మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయం నూతన కలెక్టరేట్ ఖమ్మంలో అందించాలని తెలిపారు. 30రోజుల ఉచిత శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందన్నారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఈ శిక్షణ అందించటం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704003002 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అధునాతన సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్

● అదనపు కలెక్టర్ శ్రీజ


బనిగండ్లపాడులో పాఠశాలను పరిశీలిస్తున్న శ్రీజ

ఎర్రుపాలెం, జూలై18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సౌకర్యాలతో తెలంగాణపబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కాబోతున్నాయని అదనపు కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. మండలంలోని బనిగండ్లపాడు, జమలాపురం, గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. మండలంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరులో భాగంగా ఎంపికైన బనిగండ్లపాడు, జమలాపురం జిల్లాపరిషత్ పాఠశాలలను పరిశీలించారు. తల్లిదండ్రులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. మెరుగైన సమాజం కావాలంటే నేటితరం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం ఈస్కూల్స్ ప్రారంభించబోతుందన్నారు.తెలిపారు. స్కూల్ నిర్మాణానికి గ్రామ అభివృద్ధి కమిటీ స్థలం ఇవ్వడం సంతోషకరమన్నారు. పేదలకు కార్పొరేట్‌స్థాయిలో నాణ్యమైన విద్యనందించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఈఈ డి.విన్సెంట్, ప్లానిగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ తహసీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపీడీవో బి.సురేంద్రనాయక్, ఎంపీవో శ్రీలక్ష్మి, ఎంఈవో బి.మురళి మోహనరావు, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రికి స్థలం కేటాయించాలి

మంత్రికి ఐటీసీ నాయకుల వినతి

బూర్గంపాడు, జూలై18(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పర్యటనకు విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఐటీసీ గుర్తింపు సంఘం టీఎన్‌టీయుసీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కారించారు. బూర్గంపాడు మండల పరిధిలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ మంత్రి పొంగులేటికి అందజేశారు. స్పందించిన మంత్రి పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కు ఆసుపత్రి స్థలకేటాయింపు విషయాన్ని చూడాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి,నాయకులు శేషిరెడ్డి ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు

ఇకనుంచి వెబ్‌సైట్‌లో..

- భద్రాద్రి జిల్లాలో 859 పాఠశాలలకు రూ.25 కోట్లు
- రాష్ట్రస్థాయి వరకు పనులు తెలుసుకునేందుకు వీలు

కొత్తగూడెంఎడ్యూకేషనల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): అమ్మఆదర్శ పాఠశాలల్లో జరిగే సివిల్ పనుల నివేదికలు తెప్పించుకోవడానికి జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.. నివేదికలు సకాలంలో అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర సమగ్ర శిక్ష నూతనంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ఒక వెబ్‌సైట్ పొందుపరుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రతీ పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో లాగిన్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసుకోవాలి. కొత్తపాస్‌వార్డ్ రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు సివిల్ వర్క్స్ వివరాలు ఈవెబ్‌సైట్‌లో పొందుపర్చాల్సి ఉంది. జిల్లా విద్యాశాఖ వారానికి ఒకసారి అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయి అధికారులకు పూర్తి సమాచారం సేకరించడానికి ఈవెబ్‌సైట్ దోహదపడుతుంది. గతంలో పాఠశాల, మండల, జిల్లా స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకోవడానికి నెలల తరబడి సమయం పట్టేది. ప్రస్తుతం పాఠశాల స్థాయిలో హెచ్‌ఎంలు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీలు, కాంట్రాక్టర్ల, ఇంజనీర్ల వివరాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలు 859 ఉండగా వీటి కోసం రూ. 25.40కోట్లు మంజూరు కాగా ఇంకా రూ. 19.49కోట్లు పెండింగ్ నిధులుగా ఉన్నాయి. 118 పాఠశాలలకు ఇంకా ఫైనాల్ పేమెంట్స్ చెల్లించలేదు. ఈ వెబ్‌సైట్ వల్ల పాఠశాల స్థాయి నుంచి సివిల్ వర్క్స్ వివరాలు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

పోడు.. పోరు

- చర్ల మండలం మామిడిగూడెంలో గిరిజనులకు, అటవీ అధికారులకు మధ్య ఘర్షణ
- పోలీసుల రంగ ప్రవేశం


పోడు సాగుదారులతో మాట్లాడుతున్న సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి


దాడి చేశారని చూపిస్తున్న దుమ్ముగూడెం రేంజ్ అధికారి కమల

చర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు, పోడు సాగుదారులు కారం చల్లుకుని ఘర్షణకు దిగిన ఘటన భద్రాద్రి జిల్లా చర్ల మండలం మామిడిగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధిలోని మామిడిగూడెం గ్రామ శివారులో సుమారు 120 ఎకరాల భూమి ఉంది. స్థానిక గిరిజనులు భూమిని కొంతకాలంగా సాగు చేస్తున్నామని చెబుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత, దుమ్ముగూడెం రేంజ్ అధికారిని కమల, బృందం సభ్యులు కలిసి 120 ఎకరాల భూమిలో మొక్కలు నాటేందుకు వెళ్లారు. ఇదే క్రమంలో భూమి సాగు చేస్తున్న సాగు దారులు అడ్డుకోవడంతో.. ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు వర్గాలు కొట్టుకున్నారు. ఇదే క్రమంలో కారం చల్లుకుని మరీ దాడులు చేసుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చర్ల సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి అక్కడికి చేరుకుని సాగుదారులు, అధికారులతో మాట్లాడారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

● ఎఫ్‌డీవో సుజాత ఏమన్నారంటే..

ఈ 120 ఎకరాలు భూమి అటవీశాఖదని, గతంలో ఈ ప్రాతంలో భూమి సాగు చేసిన అందరికీ పట్టాలు ఇచ్చామన్నారు. నేడు భూమిలో మొక్కలు నాటేందుకు వస్తే భూమి మాదంటూ అడ్డుకున్నారని, కారం చల్లి దాడి చేశారని తెలిపారు. ఈ భూమిలో వెదురు, మధ్యలో ఔషద గునాల మొక్కలు నాటుతామని, వచ్చిన ఆదాయం కూడా గిరిజనులకు ఇస్తామని చెప్పినా వినడం లేదన్నారు. వారం రోజుల వరకు టైం ఇస్తున్నామని, భూమిపై ఎలాంటి హక్కు పత్రాలు ఉంటే చూపించాలని తెలిపారు, లేకుంటే 120 ఎకరాల్లో మొక్కలు నాటు తామని తెలిపారు. రాజకీయ నాయకులు, అధికారులు ప్రభుత్వ భూమి రక్షణకు సహకరించాలని సూచించారు.

● సాగు దారులేమన్నారంటే..

1996 నుంచి ఈ భూమిని సాగు చేస్తున్నామన్నారు. గతంలో కొంత భూమికి పట్టాలిచ్చారని, కొంత భూమికి పట్టాలు రాలేదన్నారు. కావాలని అప్పటి అధికారులు తాత్సారం చేశారని ఆరోపించారు. నేడు భూమి సాగు చేస్తుంటే అధికారులు వచ్చి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూమిపై ఆధారపడి అనేక మంది పేదలు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాలు లేనిది ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని వాపోయారు. అధికారులపై మేము దాడి చెయ్యలేదని, కారం చల్లలేదని, కావాలని వాళ్ళే చేసి ఆరోపణలు చేస్తున్నాని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో భూమిని వదులు కోమని తెలిపారు.

లౌకిక ఇండియాకు హిందుత్వ శక్తులతో ముప్పు

- స్థానిక ఎన్నికల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను గెలిపించాలి
- మాస్‌లైన్ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌సింగ్ ఠాగూర్, రంగారావు


మాట్లాడుతున్న మాస్‌లైన్ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పోటు రంగారావు

ఇల్లెందు, జూలై 18(ఆంధ్రజ్యోతి): లౌకిక ఇండియాకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఫాసిస్టు హిందుత్వ శక్తులతో పెను ప్రమాదం ఏర్పడిందని.. అందువల్ల రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను గెలిపించి స్థానిక పరిపాలనను కాపాడుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావులు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందులో గల మాస్‌లైన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. దేశాన్ని కుల మత భాషల పేరుతో చీల్చే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర అజమాయిషీలో గవర్నర్లు, రాష్ట్రపతి పని చేస్తున్నారన్నారు. దేశంలో హిందుత్వ శక్తులతో అంతర్గత ప్రజాస్వామ్యానికి హాని కలుగుతోందని.. ప్రశ్నించే మీడియాను, జర్నలిస్టులను అక్రమ నిర్బంధాలకు గురి చేస్తున్నారని అన్నారు. న్యాయ వ్యవస్థ మొదలుకొని అన్ని రంగాల వారికి స్వేచ్ఛ లేదన్నారు. హిందుత్వ వ్యతిరేక శక్తులు న్యాయ పోరాటాలకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. అనేక హామీలు, ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా అమలు చేయడం లేదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికే రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లను దశల వారీగా అమలుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. నెలల తరబడి రేషన్ కార్డుల కోసం తిరిగినా.. అర్హులకు రేషన్‌కార్డులు అందడం లేదన్నారు. కానీ రూ. 5వేలు చెల్లిస్తే దళారులు, బ్రోకర్లు గంటల వ్యవధిలోనే రేషన్ కార్డులను అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు బాధ్యతలను విస్మరించి బూతులతో నేలబారు భాషలతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బు, కండబలం, దుర్భాషలతో రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి నుంచి కేటీఆర్ వరకు నోరు విప్పితే బూతులే మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం నుండి టెలిఫోన్ ట్యాపింగ్ వరకు అవినీతి అక్రమాలపై వస్తున్న ఫిర్యాదులపై విచారణకు ఎంత కాలం పడుతుందని ప్రశ్నించారు. నిర్దిష్ట కాల పరిమితితో దోషులను శిక్షించాలని రంగారావు డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ఆయన ఎన్నికల కమిషన్‌ను కోరారు. సీతారామా ప్రాజెక్ట్‌లో ఇల్లెందు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. పాత డిజైన్‌ను కొనసాగిస్తూ ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలను అందించాలని ప్రభుత్వాన్ని పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు రంగయ్య, అరుణ, చంద్రన్న, వెంకటేశ్వరావు, బిక్షం, రమ, రాజు, రామయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో పోడు రైతు ఆత్మహత్య

పెనుబల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో పోడు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెనుబల్లి మండలంలోని నీలాద్రి అటవీ ప్రాంతంలో నాలుగురోజుల క్రితం జరుగగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పార్థసారధిపురం గ్రామానికి చెందిన ఎట్టి వీరస్వామి (37)పోడు భూములను సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాగు కోసం రూ.5లక్షలు అప్పుచేశాడు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో చౌడారం, భవన్నపాలెం గ్రామాల మధ్యనున్న అటవీ ప్రాంతంలో నాలుగురోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం రాత్రి గ్రామస్థులు మృతదేహాన్ని చూసి అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ నారాయణమూర్తి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం అటవీ ప్రాంతంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న వీరస్వామి మృతదేహాన్ని పరిశీలించి వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి..

మధిర, (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం ఉదయం మధిర రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రుపాలెం మండలం ఇనగాలికి చెందిన చెన్నకేశవుల శేషుబాబు(52) ఉదయం ఖమ్మం వైపు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఇతడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు ఇతను మూడేళ్లుగా భార్య కుటుంబం తో కలిసి ఉండ కుండ విడిగా ఉంటున్నాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


నాగరాజు (ఫైల్)

ఎర్రుపాలెం, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్ (భీమవరం హరిజనవాడ) గ్రామలో వ్యక్తి అనుమా నస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పో లీసుల కథనం ప్రకారం విద్యానగర్ సమీపంలో అదేగ్రామా నికి చెందిన మునగాల నాగరాజు (25) రోడ్డుపక్కన గల కాలువలో విగతజీవిగాపడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో మృత దేహాన్ని గుర్తించారు. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు. మృతుడి భార్య ఐదు నెలల గర్భిణి.

ప్రమాదవశాత్తు మోకాలికి గుచ్చుకున్న గడ్డపార

● మణుగూరు వైద్యశాలకు తరలింపు



కరకగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మోకాలుకు గడ్డపార గుచ్చుకుంది. ఈ సంఘటన కరకగూడెం మండలంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అశ్వాపురంపాడు గ్రామానికి చెందిన పోడియం అడమయ్య అనే తన పొలం వద్ద ట్రాక్టర్ దిగబడటంతో ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో పక్కన వ్యక్తి గడ్డపారతో పనిచేస్తున్న క్రమంలో అదుపుతప్పి అడమయ్య కాలుకు గడ్డపార గుచ్చుకుంది. వెంటనే గ్రామస్థులు అడమయ్యను 108లో మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమైందని పెట్రోల్ పోసుకొని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని లెనిన్‌నగర్‌లో నివసిస్తున్న దీపక్ అనే యువకుడు స్థానికంగా ఓ యువతిని ప్రేమించాడు. ప్రేమకు యువతి పెద్దలు ఒప్పుకోకవడంతో పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. వెంటనే స్థానికులు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఖమ్మంకు తరలించారు.

అన్యమత ప్రచారం చేస్తున్నారని బైబిళ్లు దహనం

- ఇల్లెందులో 9మంది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల అరెస్టు

ఇల్లెందు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అన్యమత ప్రచారం చేస్తున్నారనే పేర్కొంటూ బైబిళ్లను దహనం చేసిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని 21ఫిట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. 21ఫిట్‌లో ముగ్గురు వ్యక్తులు తమ మతంలో చేరాలంటూ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా 21 ఫిట్‌లో ఇంటింటికీ వెళ్లి బైబిళ్లను పంచుతూ ప్రచారం చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పట్టణంలోని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. 21ఫిట్‌లో అన్యమత ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి.. వారితో వాగ్వాదానికి దిగారు.

అనంతరం వారి వద్ద ఉన్న బైబిళ్లను తీసుకుని రహదారిపై కుప్పగా పడవేసి పెట్రోల్ పోసి దహనం చేశారు. కాగా.. ఈ ఘటనపై అన్యమతస్తులు ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు 9మంది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ దత్తతపై కేసు నమోదు

దుమ్ముగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అక్రమదత్తత వ్యవహారంపై దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్లో శుక్రవారం కేసు నమోదైంది. చిన్నార్లగూడేనికి చెందిన కొర్సా రమేష్, ఆదిలక్ష్మి దంపతులు అశ్వాపురం మండలం కుర్వపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన మెస్సా నర్సింహారావు, అమల దంపతుల నాలుగో సంతానమైన పాపను రెండు నెలల క్రితం తెచ్చి పెంచుకుంటున్నారు. ఈ విషయం జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆపరేషన్ ముస్కాన్-11 బృందం సభ్యులకు సమాచారం అందడంతో విచారణ జరపాలని దుమ్ముగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతిను డీసీపీఓ ఆదేశించారు. శుక్రవారం సీడీపీఓ జ్యోతి సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితర సిబ్బందితో కలిసి చిన్నార్లగూడెంలో విచారణ జరిపారు. దత్తత అక్రమమని తేలడంతో ఆరునెలల పాపను రక్షించి భద్రాచలంలోని శిశుగృహలో సంరక్షణ నిమిత్తం అప్పగించారు. దత్తత ఇచ్చిన, తీసుకున్న ఇరువర్గాల దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఐసీడీఎస్ అధికారులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు జరగాలి

» కలెక్టర్ అనుదీప్

» కామేపల్లి పీహెచ్‌సీ, పశువైద్యశాల తనిఖీ



పశు వైద్యశాలలో మేకను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, పిల్లలను దత్తత ఇస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కామేపల్లి, జూలై18(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక కేంద్రాలలో సాధారణ ప్రసవాలు, లోరిస్క్ ప్రసవాలు జరిగేలా దృష్టి సారించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీల, పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ, పరీక్ష గది, ఆసుపత్రిలో మందుల నిల్వలు, సాధారణప్రాథమిక వైద్యసేవలు, గర్భిణులకు అందుతున్న సేవలు, ఆసుపత్రి నిర్వహణ, ప్రజలకు అందించనున్న చికిత్సలు, ఓపీ సేవలు, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ఇన్ వార్డు, రోగుల వార్డులను పరిశీలించారు. శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఓపిఎంత మంది వస్తున్నది, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా కేసులు ఎన్ని నమోదు అయినవి తెలుసుకున్నారు. అవసరమూప మందులు స్టాక్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పశువైద్యశాలకు వెళ్లి చికిత్సకు వచ్చిన మేకలను కలెక్టర్ పరిశీలించారు. సోమటైటిస్‌తో ముకలు బాధ పడుతున్నట్లు పశు వైద్యాధికారి తెలిపి, మందులు సరఫరా కావాలన్నారు. భవనం శిథిలావస్థకు చేరినందున పీఆర్ ఇంజనీరింగ్ శాఖతో ఎస్టిమేట్ వేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. అక్కడ ఉన్న ఓ రైతులో మాట్లాడుతూ గేదెలు ఎన్ని ఉన్నాయని, పాలు ఎంత ఇస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా లేదని లబ్ధిదారులు తెలపడంతో తహసీల్దార్ సుధాకర్‌తో మాట్లాడారు. సమస్య పరిష్కరించాలన్నారు.ఈతనిఖీలో ఆర్‌ఐ సక్రూ, ఎంఈఓ వెంకట్, పశువైద్యాధికారినాగులు పాల్గొన్నారు.

చట్టబద్ధ దత్తతను ప్రోత్సహించాలి

దంపతులకు పిల్లలను అందించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్: చట్టబద్ధమైన దత్తత ద్వారానే పిల్లలను పొందాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టర్ అనుదీప్ ఇద్దరు కవల పిల్లలను (బాలికలు) మైసూరు, సంగారెడ్డికి చెందిన తల్లితండ్రులకు చట్టప్రకారంగా దత్తతగా అందచేశారు. బాలికలను స్వీకరించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. దత్తత ప్రక్రియ చట్టబద్దంగా జరిగితే ఆ కుటుంటంలో పిల్లల భవిష్యత్తుకు మంచి మార్గం ఏర్పడుతుందన్నారు. అలా కానీ పక్షంలో కొద్ది రోజులు పెంచుకున్న తర్వాత చట్టపరమైన సమస్యలు ఎదుర్కోక తప్పదన్నారు. ఒక బిడ్డను మన కుటుంబంలోకి ఆహ్వానించినప్పుడు, బిడ్డకు తల్లిదండ్రులకు చట్టపరమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. బంధువుల మధ్య దత్తత చట్టపరంగా లేనట్లయితే భవిష్యత్తులో ఇరు కుటుంబాల మధ్య సమస్యలు ఉత్పన్నం అయితే పిల్లలకుభద్రత కోల్పోతారని అన్నారు. ఇలాంటి ఇబ్బందులు రాకుండా మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా మాత్రమే దత్తత, రక్తసంబంధీకులు చట్టబద్ధగా దత్తత తీసుకోవడానికి వీలవుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పెంచుకోలేనటువంటి పరిస్థితి ఉన్నట్లడితే ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్‌కు సమాచారం అందిస్తే మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారులకు పిల్లలను అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రామ్ గోపాల్ రెడ్డి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణు వందన, డాక్టర్ రాజేశ్వర్‌రావు, యశోద తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో విపత్తుల కంట్రోల్ రూమ్

» నంబర్ 83338 33696 కేటాయింపు

» వర్షాల ప్రభావంతో ముందస్తు జాగ్రత్త చర్యలు

» 24గంటల పాటు సిబ్బంది కేటాయింపు

» ప్రకృతి విపత్తులపై ఫిర్యాదులకు ప్రత్యేక ఫోన్ నెంబర్లు

ఖమ్మంకార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులు, ఆకస్మికంగా వర్షాలు పడటంతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. గతసెప్టెంబరు 1న కురిసిన వర్షాలు, మున్నేరుకు వచ్చిన వరద పోటు అనుభవంతో ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వారంలో అన్ని రోజులు పని చేసేలా కార్యచరణ చేశారు. రోజులో 24 గంటల పాటు సిబ్బంది ఉండేలా 8 మంది ఉద్యోగులకు విధులు కేటాయించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి తిరిగి ఉదయం 7గంటల వరకు ఉద్యోగులను కేటాయించారు. కేఎంసీ కంట్రోల్ రూమ్‌లో విధులు కేటాయించిన ఉద్యోగులకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేశారు. వాతావరణంలో మార్పులను ఎప్పటికప్పుడు ఇతరశాఖల నుంచి తెలుసుకోవటం, ఖమ్మం నగర పాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులకు సరైన సమయానికి సమాచారం ఇవ్వటం, వర్షపాతం నమోదు, డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్‌లకు సమాచారం ఇవ్వటంపై ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌కు ప్రత్యేక అధికారిగా కేఎంసీ రెవెన్యూ ఆఫీసర్ యాకూబ్ పాషాను నియామకం చేశారు. ప్రకృతి విపత్తులపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 83338 33696ను కేటాయించారు. ప్రజల సాధారణ సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు ప్రభుత్వ కార్యాలయం పని సమయంలో 7901298265 నెంబర్‌లకు ప్రజలు ఫోన్ చేయాల్సి ఉంటుంది.

పెండింగ్ వేతనాలివ్వాలంటూ సిబ్బంది ధర్నా



ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

నేలకొండపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సీహెచ్‌సీ ముందు ధర్నా చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలివ్వక పోవటంతో కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులున్నాయని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు అన్నారు. వేతనాలను వెంటనే ఇవ్వాలని, లేనిపక్షంలో అందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హీరాలాల్, సైదావలి, సాయిరామ్, సుజాత, వీరకుమారి, వెంకటలక్ష్మి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

మదన్‌లాల్ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ



మదన్‌లాల్ సతీమణితో మాట్లాడుతున్న కేటీఆర్

ఖమ్మం మార్కెట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మరణించిన వైరా మాజీఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లారు. మదన్‌లాల్ సతీమణితో మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు సేవలందించాలని, పార్టీ తరుపున సహకారం అందించేందుకు సిద్ధమని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌కు హెలీప్యాడ్ వద్ద స్వాగతం

శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నగరంలోని మమత మెడికల్ కళాశాల వద్ద హెలీప్యాడ్ వద్ద పార్టీ క్యాడర్ అపూర్వ స్వాగతం పలికారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య,ఏఎంసీ మాజీచైర్మన్ గుండాల క్రిష్ణ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పలువురు కార్పోరేటర్లు పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు.

హార్వెస్ట్ పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం



బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న రవిమారుత్, పార్వతీరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ పాఠశాల ఆవరణలో శుక్రవారం బాస్కెట్‌బాల్ కోర్టులను విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు అధునాతన బాస్కెట్‌బాల్ కోర్టును నిర్మించామని తెలిపారు. తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు పెద్ద పీట వేస్తున్నామని, క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని వారు అన్నారు.

నేడు ఇసుక వేలం పాట

తిరుమలాయపాలెం, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరు నది పరివాహక ప్రాంతమైన ముజాహిద్‌పురంలో ఇటీవల పట్టుబడిన ఇసుక డంపును శనివారం వేలం వేయనున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేస్తున్నట్టు తహసీల్దార్ లూథర్‌విల్సన్ తెలిపారు. సుమారు 30ట్రాక్టర్ల ఇసుకను వేలం వేస్తున్నట్టు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు రూ.వెయ్యి చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

రాతమారని రామన్నపేట రహదారి

» 59, 60 డివిజన్లతో పాటుగా కామంచికల్‌కు ప్రధాన దారి

» పదేళ్లుగా గుంతలమయం

» ప్రతిపక్షాలకు రాజకీయ అస్త్రం



గుంతల మయంగా మారిన రామన్నపేట రహదారి

ఖమ్మం కార్పొరేషన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారిన ఖమ్మం నగరంలో విలీనమైన రామన్నపేట రహదారి రాతమారటం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. 59, 60డివిజన్లకు ప్రధాన రహదారితో పాటుగా రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, డోర్నకల్ ప్రాంతాలకు ప్రజలు వెళ్లేందుకు ఈ రహదారినే ఎంచుకుంటారు. అయితే ఏటా ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి ఇదే రహదారికి మరమ్మతులకు నిధులు కేటాయిస్తుంటారు. కానీ పూర్తిస్థాయిలో రహదారి విస్తరణకు నోచుకోవటం లేదు. దీంతో వర్షం పడిందంటే ప్రధాన రహదారి గుంతల మయంగా మారుతోంది. ద్విచక్రవాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురైతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించి ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ రహదారి సమస్య ఇప్పుడు కాంగ్రెసేతర రాజకీయ పక్షాలకు రాజకీయ అస్త్రంగా కూడా మారింది.

డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

ఏవో వాణి



డ్రోన్‌తో నానో యూరియా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో వాణి

కూసుమంచి, జూలై 18(ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని కూసుమంచి ఏవో వాణి తెలిపారు. కూసుమంచి మండలం గోపాలరావుపేట గ్రామంలోని పత్తి వ్యవసాయక్షేత్రంలో డ్రోన్‌తో నానో యూరియా పిచుకారీపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. డ్రోన్ వినియోగం వలన రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానోయూరియా వినియోగించడం వలన అనేక లాభాలున్నాయని తెలిపారు. సాధారణ యూరియాలో నత్రజని వినియోగం సామర్థ్యం 30నుంచి 40శాతం వరకు ఉంటే నానో వలన 85శాతం వరకు ఉంటుందని తెలిపారు. నేరుగా మొక్క ఆకులపై పిచుకారీ చేయడం వలన తక్కువ మోతాదులో నత్రజని మొక్కకు అందిస్తుందన్నారు. నానో యూరియా, డీఏపీ కొన్ని రకాల పురుగుమందులతో కలిపి పిచుకారీ చేసుకోవచ్చన్నారు. రైతులకు ఖర్చు తగ్గుతుందని ఏవో వాణి రైతులకు వివరించారు.

భూ సమస్యల పరిష్కారానికే సాగు న్యాయ యాత్ర

» రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్

» మండలంలో పలు గ్రామాల్లో పర్యటన



పాలేరులో రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్

కూసుమంచి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భూమి వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించేందుకే సాగు న్యాయ యాత్ర చేపట్టినట్లు రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్ తెలిపారు. యాత్రలో భాగంగా శుక్రవారం కూసుమంచి, పాలేరు గ్రామాల్లో పర్యటించారు. రైతులతో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూ సమస్యలను రైతు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కూసుమంచిలో కొందరి రైతుల భూములు ఒకచోట సర్వే నెంబర్లు ఒక చోట ఉన్నాయని వాపోయారు. మరికొందరు తమకు భూమి ఉన్నప్పటికీ ఆర్‌ఎస్‌ఆర్ బ్యాలన్స్ లేదంటూ రికార్డుల్లో నమోదు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన రైతు కమిషన్ సభ్యుడు న్యాయపరంగా వెళ్లేందుకు అవకాశం ఉందన్నారు. సమస్యలన్నింటినీ న్యాయపరంగా ఎదుర్కొనేందుకు వివరించేందుకు అవసరమైన కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా భూమి సునీల్ మాట్లాడుతూ రైతుల కోసం 120 భూమి చట్టాలు, 50 వ్యవసాయ చట్టాలు ఉనాయని, రైతులు వీటిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో రైతులు న్యాయస్థానాల ద్వారా నష్టపరిహారం పొందుతున్నారని, మన ప్రాంతంలోనూ హక్కుల కోసం రైతులు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రైతులు ఏవైనా సమస్యలుంటే కమిషన్ దృష్టికి తీసుకరావాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ శ్రీహరి వెంకటప్రసాద్, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, కూసుమంచి ఏవో వాణి, లీఫ్స్ ప్రతినిధులు జీవన్, అభిలాష్, మల్లేష్, రవి, ఏఈవోలు సౌమ్య, ప్రియాంక, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

తపాలా సేవల్లో నూతన సాంకేతికత



తపాలా ఎస్పీ వీరభద్రస్వామి

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం తపాలాశాఖ డివిజనల్ పరిధిలో ఈనెల 22 నుంచి 2.0 సాంకేతిక సేవలు అందుబాటులో రానున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. జిల్లాలో తపాలాశాఖలో సురక్షితమైన సేవలను ప్రజలకు అందించడం కోసం అధునాతన సాంకేతిక విధానం అమలు చేయనున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా తపాలాశాఖ కార్యాలయాల ద్వారా సేవలన్నింటిని ఒకే ప్లాట్‌ఫారం మీదకు తీసుకొచ్చేందుకు నిర్వహిస్తున్న పనులతో ఈ నెల 19, 21 తేదీల్లో పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని ఖాతాదారులు సహకరించాలని ఆయన కోరారు. 2 హెడ్ పోస్టాఫీసులు, సబ్ పోస్టాఫీసులు, బ్రాంచి కార్యాలయాల్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయనున్నట్టు వివరించారు. దీంతో పార్సిల్, సీవోడీ, వీపీపీ వంటి సేవల బట్వాడా మరింత వేగవంతం అవుతుందన్నారు. జూలై 21 వరకు పూర్తి స్థాయిలో లావాదేవీలు నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పోరాటం

» గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్

వైరా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ ప్రకటించారు. తెలంగాణ గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం భూక్యా కృష్ణ అధ్యక్షతన వైరాలోని బోడేపూడి భవన్‌లో గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు 15రకాల హామీలిచ్చిందని అయితే ఈ రెండేళ్ల కాలంలో ఒక్క హామీని కూడా అమలుచేయకుండా గిరిజనులను మోసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గిరిజన జనాభా పదిశాతం ఉందని ఆప్రకారం రెండు మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక్కరికి మాత్రమే మంత్రి పదవి ఇచ్చి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిందని విమర్శించారు. రాష్ట్రంలో పోడుభూములను సాగుచేస్తున్న గిరిజనులపై అటవీశాఖ అధికారులు నిర్లక్షణంగా దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మంజిల్లా కారేపల్లి మండలం ఎర్రబోడు ప్రాంతంలో మహిళలను కూడా చూడకుండా పురుష అధికారులు గిరిజన మహిళలపై అమానుషంగా దాడిచేశారని అలాంటి అధికారులపై ఎస్సీ ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ అమర్‌సింగ్, ఉమ్మడిజిల్లా నాయకులు బాదావత్ శ్రీను, కనును సోతు షణ్ముక్, బాణోతు బన్సీలాల్, తేజావత్ కృష్ణకాంత్, గుగులోతు నాగేశ్వరరావు, అజ్మీరా శోభన్‌నాయక్, భూక్యా రమేష్, శంకర్, దరావత్ వినోద్‌కుమార్, మండియా పాల్గొన్నారు.



'ఇళ్ల' అవకతవకలపై విచారణ చేపట్టాలి: సీపీఎం

మధిర రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంపాడు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలతోపాటు ఇళ్లు రాని పలు కుటుంబాల వారు ఈ నిరసనలో పాల్గొన్నారు. వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ కాలనీ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ.. ఖమ్మంపాడులో అర్హులైన పేదలకు ఇళ్లు రాలేదని, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్ల జాబితాలో ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. నిబంధనలను తుంగలో తొక్కి పొలాలు, ట్రాక్టర్లు, పెద్ద పెద్ద ఇళ్లు ఉన్నవారికే మళ్లీ ఇళ్లు మంజూరు చేయడం దారుణమన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం

ఎర్రుపాలెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం పొందవచ్చని ఏఈవో వంశీకృష అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాజుపాలెం, నారాయణపురం గ్రామ రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్ వేసిన నాలుగేళ్ల తర్వాత నుంచి30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం వస్తుందని ఆయన అన్నారు. దళారులు ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించ వచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం ఇతరులకు 80శాతం రాయతీ డ్రిప్‌ఇరిగేషన్ పరికరాలను అందిస్తుందన్నారు.అంతరపంటలను సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.



పెనుబల్లి గిర్దావర్‌ల బదిలీ!

పెనుబల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి రెవెన్యూ కార్యాలయంలో గిర్దావర్‌లుగా పనిచేస్తున్న విజయ్‌భాస్కర్, జగదీష్‌లపై పలు ఆరోపణల నేపథ్యంలో జిల్లా అధికారులు ఒకరిని కామేపల్లి మండలానికి, మరొకరిని కారేపల్లి మండలానికి బదిలీ చేసినట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల మండలంలోని ఒక మీసేవ కేంద్రంలో పనిచేస్తున్న వ్యక్తి అధికారుల పేరు చెప్పి వసూళ్ల దందాకు తెరలేపినట్లు ప్రచారం జరగడంతోపాటు దళారులను ఏర్పాటుచేసుకొని వసూళ్లు చేపడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాలపై నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు అందడంతో జిల్లా అధికారులు వీరిని బదిలీ చేసినట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ నారాయణమూర్తిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా గిర్దావర్‌ల బదిలీ తమ దృష్టికి రాలేదన్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన సదస్సు



నానోయూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రసాదరాజు

పెనుబల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నానోయూరియా, నానోడీఏపీ వాడకంపై ఇఫ్కో వారి ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారి ఏవీఎస్.ప్రసాదరాజు పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం, రామచంద్రరావుబంజర్ గ్రామాల్లో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. నానోయూరియా ఘన రూపంలో కాకుండా ద్రవరూపంలో వాడడం వల్ల తక్కువ ఖర్చు, ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. నానోయూరియా వాడకం వలన నత్రజని పోషకాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో కె.నరేష్, కంపెనీ ప్రతినిధి మహేశ్వర్‌రెడ్డి, రైతులు చిన్నం మల్లయ్య, ఆదినారాయణ, గుగులోతు ప్రసాద్ పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

» మరమ్మతులకు నోచుకోని వైనం.. పాతసెంటర్‌లో మరీ ఘోరం

» ప్రమాదాలకు నిలయంగా సత్తుపల్లి రింగ్‌సెంటర్

సత్తుపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని రింగ్‌సెంటర్, పాతసెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ఇష్టానుసారంగా వాహనదారులు వెళ్తున్నారు. సత్తుపల్లి ప్రాంతం నుంచి నిత్యం హైదరాబాద్, భద్రాచలం,



రింగ్‌సెంటర్‌లో పనిచేయని ట్రాఫిక్స్ సిగ్నల్స్



అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు

విజయవాడ, రాజమండ్రి, ఏలూరు తదితర ప్రాంతాలకు వాహనాల రాకపోకలు వేలాదిగా సాగిస్తుంటాయి. అదే విధంగా రాష్ట్రీయ సరిహద్దు ప్రాంతమైన సత్తుపల్లిలో ఎప్పుడూ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతూనే ఉంటుంది. అయితే కొద్దిరోజులుగా రింగ్‌సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ మొరాయించడంతో పాటు పాతసెంటర్‌లో ఏళ్ల తరబడి సిగ్నల్స్ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రమాదాలు ఆయా ప్రాంతాలలో నిత్యకృత్యమయ్యాయి. అసలే జాతీయ రహదారి ఇరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారులు, స్థానిక వ్యాపారులతో ఆక్రమణకు గురై ప్రమాదాలు ప్రతిరోజూ చోటుచేసుకుంటుండగా సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనదారులు అడ్డదిడ్డంగా వెళ్లడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, పోలీసులు స్పందించి సిగ్నల్ వ్యవస్థ సరిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వచ్చేవారం ఏర్పాటు చేయిస్తాం..

నరసింహా, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

ఇదే విషయమై సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కె.నరసింహాను వివరణ కోరగా వచ్చేవారంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతులు చేయించి మళ్లీ సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. కాగా మరమ్మతులు పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్లు పట్టణ సీఐ టీ.శ్రీహరి తెలిపారు.



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఎంఈవో రమణయ్య

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

ముదిగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమ్మి ఎంపీపీఎస్ విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలును గ్రామానికి చెందిన కందుల రామకృష్ణ సహకారంతో ఎంఈవో రమణయ్య శుక్రవారం పంపిణీ చేశారు. దాతలు ఇచ్చిన సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే పాఠశాలలో వాల్‌రైటింగ్ కోసం రూ.పదివేలు పంబా రమేష్, రూ.ఐదువేలను ఏలూరి హన్మంతరావు, రూ.మూడు వేలు వడ్డే వెంకటనారాయణలు అందజేసినట్లు ఎంఈవో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాధిక, ఉపాధ్యాయులు సురేష్, షర్మిల, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో శుభ్రతేదీ : కమిషనర్

సత్తుపల్లిరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాల సీజన్‌లో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మెరుగు పడాలని సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ కే.నరసింహా అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సెక్షన్ విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయిల్‌బాల్స్ వేయించాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. ఇంటి వద్దకు వచ్చే ట్రాక్టర్‌లో మాత్రమే చెత్తాచెదారాన్ని వేయాలని, పిచ్చిమొక్కలు పెరిగే ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు

పెనుబల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లో ధర్నాకు తరలివెళ్తున్న పెనుబల్లి మండల మాజీ సర్పంచ్‌లను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచ్‌లు గ్రామాల్లో లక్షలాదిరూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశారు. వాటికి సంబంధించిన బిల్లుల కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నప్పటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. మాజీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మందడపు అశోక్‌కుమార్, కార్యదర్శి గోదా చెన్నారావుతోపాటు తేజావత్ తావునాయక్, కోమటి ప్రసాద్, దొడ్డపనేని రవికుమార్ ఉన్నారు.

'ఇళ్ల' అవకతవకలపై విచారణ చేపట్టాలి

» సీపీఎం ఆధ్వర్యంలో జీపీ కార్యాలయం ముట్టడి

మధిర రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంపాడు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలతోపాటు ఇళ్లు రాని పలు కుటుంబాల వారు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ కాలనీ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కార్యక్రమానుద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ.. ఖమ్మంపాడులో అర్హులైన పేదలకు ఇళ్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్ల జాబితాలో ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. నిబంధనలను తుంగలో తొక్కి పొలాలు, ట్రాక్టర్లు, పెద్ద పెద్ద ఇళ్లు ఉన్నవారికే మళ్లీ ఇళ్లు మంజూరు చేయడం దారుణమన్నారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై విచారణ జరిపించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు పాపినేని వెంకటనర్సయ్య, అమరయ్య, లాలు, వెంకటేశ్వరరావు, షేక్.మీరా పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

వైద్య విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

» ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి

సత్తుపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నియోజకవర్గంలో వైద్యవిద్యపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని జ్యోతి నిలయం స్కూల్‌లో మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో విద్యావంతులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభించిన రోజే స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, హాస్టళ్లలో డైట్ చార్జీలను పెంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అలాగే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లీదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని, పాఠశాలలను, వసతి గృహాలను ఎప్పటికప్పుడు తాము తనిఖీ చేస్తామని చెప్పారు. 10వ తరగతి ఫలితాలలో నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెట్టినందుకు ప్రధానోపాధ్యాయులను అభినందించారు. ఎంఈవో రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుంతలు పూడ్చేందుకు రేషన్ డీలర్ చేయూత



కప్పలబంధంలో గ్రావేల్ తోలిస్తున్న రేషన్ డీలర్ భాస్కరరెడ్డి

కల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా తయరయ్యాయి. స్థానిక వాహనదారులకు ఈ గుంతల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో స్థానిక రేషన్ డీలర్ జిల్లెల భాస్కరరెడ్డి స్పందించి గుంతలను పూడ్చేందుకు తన వంతుగా సొంత ఖర్చుతో పది ట్రక్కుల గ్రావేల్‌ను తెప్పించి రహదారిపై ఏర్పడిన గుంతలను తన సొంత ఖర్చులతో కూలీలను పెట్టించి వాటిని పూడ్చించాడు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రమాదాల నివారణకు ఇలా తన ఓదార్యాన్ని చాటుకున్న రేషన్ డీలర్ భాస్కరరెడ్డిని స్థానికులు అభినందించారు.

ఎరువు దుకాణాల తనిఖీ

మధిర రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని నిధానపురం, సిద్దినేనిగూడెం, మడుపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏడీఏ విజయ్‌చంద్ర తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్, రైతుల అమ్మకాల రిజిస్టర్, బిల్లు బుక్‌లను పరిశీలించారు. స్టాక్ బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు.

రహదారి మూసివేతపై రైతుల నిరసన



రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చింతకాని, జూలై 18(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట- దేవరపల్లి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండల పరిధిలోని బస్వాపురం గ్రామ సమీపంలో చింతకాని సాగర్ మేజర్‌పై జాతీయ రహదారి నిర్మించారు. సాగర్ కాల్వను రెండుగా చీల్చుతూ జాతీయ రహదారి నిర్మాణం చేయడం వల్ల సాగర్ ఆయకట్టు రైతుల రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. దీంతో శుక్రవారం సాగర్ ఆయకట్టు రైతులు జాతీయ రహదారి పనుల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వీలుగా నిర్మించాల్సిన మైనర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం కారణంగా తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని వెంటనే మైనర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన గోపి, బొడ్డు వెంకటరామారావు, ముప్పారపు సైదులు, బొడ్డు సంజీవరావు, కన్నెబోయిన పాండు, శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, బొంతు శ్రీనివాసరావు, పొల్నీడు రవీంద్రబాబు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

» బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి

ముదిగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు ఎర్ర వెంకన్న, బంకా మల్లయ్య, ధర్మా, అనంతరాములు, సెల్వరాజ్, అమరయ్య, బిక్షం, వెంకట్ పాల్గొన్నారు.

నేడు వైరాలో ఇందిరా మహిళాశక్తి సంబరాలు

» ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో ఇందిరా మహిళా శక్తి సంబరాల కోసం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రతీకగా ఈ ఇందిరమ్మ సంబరాలు నిర్వహిస్తున్నారు. దాదాపు ఐదు నుంచి ఆరువేల మంది డ్వాక్రా మహిళలు ఈ సంబరాల్లో పాల్గొంటారని అంచనా. వీటి కోసం రెండురోజులుగా వ్యవసాయ మార్కెట్‌యార్డులో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్వయంగా ఈ ఏర్పాట్లను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వైరా నియోజకవర్గంలో 702స్వయం సహాయక సంఘాలకు రూ.77.05కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పంపిణీ చేయనున్నారు. వడ్డీ లేని రుణాలు రూ.4.83కోట్లు, ప్రమాద బీమా రూ.60లక్షలు, లోన్ బీమా రూ.42.27లక్షలు మొత్తం కలిపి రూ.5.85కోట్ల పైచిలుకు కలిగిన 480చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారు. అలాగే నియోజకవర్గస్థాయిలో కొత్తగా మంజూరైన 4300రేషన్‌కార్డులను పంపిణీ చేస్తారు. ఫ్రీ పల్లెవెలుగు బస్సుల పథకం కింద నియోజకవర్గంలో ఐదు పల్లెవెలుగు బస్సులను రూ.1.80కోట్లతో అందజేయనున్నారు. ఈవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వాలంభన కోసం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి సంబరాలను జయప్రదం చేయాలని అధికారులు కోరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సీతరాములు, వెంకటనర్సిరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ జైపాల్, నాయకులు బొర్ల గంగారావు, అశోక్, మిట్టపల్లి నాగి,రాజశేఖర్, నర్సింహారావు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోం: బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోతు విజయ్

సత్తుపల్లిరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టబెడుతూ అర్హులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని, అర్హుల పక్షాన తాము పోరాడతామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోతు విజయ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రానున్న మునిసిపల్ ఎన్నికలలో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహిళా శక్తి సంబరాలలో భాగంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 'చొక్కాతో సంబంధం లేకుండా అర్హులకే ఇల్లు ఇస్తామని' చెప్పగా "వేరే చొక్కాల సంగతి పక్కనబెడితే మీ చొక్కాలైన అర్హులకే రాలేదని, నియోజకవర్గంలో మీ ఇష్టం వచ్చిన గ్రామానికి వెళ్లి అర్హులకు కాకుండా అనర్హులకు ఇచ్చారని", దీనిని నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌మిశ్రా, జొన్నలగడ్డ నరేష్, మట్టా ప్రసాద్, మందా శివ, పాలకొల్లు శ్రీనివాస్, కార్తీక్, గణేష్, జగదీష్, శివ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరెయ్యాలి

» కేటీఆర్‌ను కలిసిన కూసంపూడి

సత్తుపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరెయ్యాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పినట్లు మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కేటీఆర్‌ను మహేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం మీద ప్రజలకు పీకల వరకు కోపం ఉందని, ఈ వ్యతిరేకతను సరిగ్గా వాడుకుంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని స్థానాలను బీఆర్ఎస్ ఖచ్చితంగా గెలుచుకోవచ్చునన్నారు. యువత ముందుకు వచ్చి కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరించగలిగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు వస్తాయని కేటీఆర్ అన్నారన్నారు. ఆయన్ను కలిసిన వారిలో సత్తుపల్లి నియోజకవర్గంలోని 5మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



'సంక్షేమ పథకాల అమలులో అధికారుల ప్రేక్షకపాత్ర'

ఎర్రుపాలెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమపథకాల అమల్లో అధికారుల ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని, రాజకీయ జోక్యంతో అధికర పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ ఏకపక్షంగా నిర్ణయాలు అమలు చేస్తున్నారని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు ఆరోపించారు. మండలంలోని భీమవరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు కాకుండా ఇందిరమ్మ కమిటీలు ప్రతిపాదించిన వారికి ఎంపిక చేశారని విమర్శించారు రేషన్‌కార్డుల దరఖాస్తుల విషయంలో ఎటువంటి విచారణ లేకుండా మంజూరు,తొలగింపు అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రజా ధనం ధ్వంసం చేసిన అధికారపార్టీ నాయకులపై చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కమిటీసభ్యుడు గొల్లఉడి పెద్దకోటేశ్వరరావు, యరమల వెంకటనారాయణరెడ్డి, ల్లబోతు హనుమంతరావు,వీరాంజనేయులు, పోతేటి వెంకటనారాయణరెడ్డి, భాస్కరావు, సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి ఇంటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

వైరా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో పేదవాడి సొంతింటి కల సాకారం చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. వైరా మునిసిపాలిటీలో మొదటి విడతలో మంజూరు చేసిన 500ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా శుక్రవారం 1,4,12వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మొదటి విడతలో ఇళ్లు రాని వారు అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులు సకాలంలో ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతరాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు బొర్ల గంగారావు, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, ధార్న రాజశేఖర్, పాలేటి నర్సింహారావు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలికి చీరె అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం

ఎర్రుపాలెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం పొందవచ్చని ఏఈవో వంశీకృష అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాజుపాలెం, నారాయణపురం గ్రామ రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిలపామ్ పంట వేసిన నాలుగేళ్ల తర్వాత నుంచి30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం వస్తుందని ఆయన అన్నారు. దళారులు ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించ వచ్చన్నారు. పామాయిల్ సాగుచేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం ఇతరులకు 80శాతం రాయతీ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందిస్తుందన్నారు. పామాయిల్ పంటలో అంతరపంటలను సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

సీసీ రహదారుల నిర్మాణానికి నిధుల విడుదల

చింతకాని, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణంలో భాగంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి చింతకాని మండలంలో పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్లు నిధులు మంజూరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో మత్కేపల్లి, తిమ్మినేనిపాలెం, నరసింహపురం, నాగిలిగొండ, చింతకాని, పాతర్లపాడు, కోమట్లగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో అదనంగా 50 విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి జలాలకు ఎమ్మెల్యే పూజలు

వేంసూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలు నాగార్జున్ సాగర్ కాల్వ ద్వారా వేంసూరు మండలానికి శుక్రవారం చేరాయి. కుంచపర్తి రెగ్యులేటర్ వద్ద గోదావరి జలాలకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు, రైతులు పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, రైతులు పాల్గొన్నారు.



గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పోరాటం

» గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్

వైరా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ ప్రకటించారు. తెలంగాణ గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం భూక్యా కృష్ణ అధ్యక్షతన వైరాలోని బోడేపూడి భవన్‌లో గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు 15రకాల హామీలిచ్చిందని అయితే ఈ రెండేళ్ల కాలంలో ఒక్క హామీని కూడా అమలుచేయకుండా గిరిజనులను మోసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గిరిజన జనాభా పదిశాతం ఉందని ఆప్రకారం రెండు మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక్కరికి మాత్రమే మంత్రి పదవి ఇచ్చి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిందని విమర్శించారు. రాష్ట్రంలో పోడుభూములను సాగుచేస్తున్న గిరిజనులపై అటవీశాఖ అధికారులు నిర్ధాక్షణంగా దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మంజిల్లా కారేపల్లి మండలం ఎర్రబోడు ప్రాంతంలో మహిళలను కూడా చూడకుండా పురుష అధికారులు గిరిజన మహిళలపై అమానుషంగా దాడిచేశారని అలాంటి అధికారులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసంఘం ఖమ్మంజిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ అమర్‌సింగ్, ఉమ్మడిజిల్లా నాయకులు బాదావత్ శ్రీను, కనునుసోతు షణ్ముక్, బాణోతు బన్సీలాల్, తేజావత్ కృష్ణకాంత్, గుగులోతు నాగేశ్వరరావు, అజ్మీరా శోభన్‌నాయక్, భూక్యా రమేష్, శంకర్, దరావత్ వినోద్‌కుమార్, మండియా, తేజావత్ సీతరాములు, లకావత్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్‌నాయక్